క్లుప్తంగా

డిసెంబర్ 27న డైరీ ఆవిష్కరణ

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం 2024 డైరీని డిసెంబర్ 27న ఆవిష్కరించనున్నట్లు ఆ సంఘం నాయకులు శేషాద్రి రెడ్డి, చంద్రమౌళిపిళ్లై తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న ఆవిష్కరణ సభను విద్యుత్ ఉద్యోగులు జయప్రదం చేయాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు చిట్టిబాబు తెలిపారు. ప్రవాస్‌యోజన కార్యక్రమంలో భాగంగా గురువారం గిరింపేటలో ఆయన కార్యకర్తలతో సమావేశమయ్యారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలు క్షేత్రస్థాయిలో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యం, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ


బాధితునికి చెక్ అందిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్, ఎంపీపీ నాయకులు

యాదమరి: మండలంలోని ముద్దురామాపురానికి చెందిన సంజీవిగౌడకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.1.50లక్షల చెక్‌ను జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్‌బాబు అందించారు. సంజీవిగౌడ్ ఆరోగ్య పరిస్థితిని, వైద్య ఖర్చులను స్థానిక సర్పంచ్ దయానందరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ సహకారంతో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు విన్నవించారు. ఆయన వెంటనే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రూ.1.50 లక్షలు మంజూరు చేయడంతో, బాధితునికి గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న పార్థసారథి నాయుడు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం 27వ వార్డు, చామంతిపురంలో నివాసముంటున్న ప్రశాంత్ రోడ్డు ప్రమాదంలో కాళ్లు విరిగి మంచానపడిన ప్రశాంత్, రెండు కిడ్నీలు పాడైపోయి అనారోగ్యంతో బాధ పడుతున్న తన ఐదేళ్ల కుమార్తె తీర్థనకు దాత పార్థసారథి నాయుడు గురువారం ఆర్థికసాయం అందించారు. ఈ తరుణంలో తీర్థన వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న దాత పార్థసారథినాయుడు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు


సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

కార్వేటినగరం: మండలకేంద్రంలోని బాలాజీ కాలనీలో వెలసిన శ్రీ షిరిడీ సాయినాథుని ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు ఆలయ అధ్యక్షుడు బాలాజీ చేతుల మీదుగా ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడికి పౌర్ణమి హారతులు

పుత్తూరు రూరల్: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గీతామందిరంలో వెలసిన శ్రీకృష్ణ భగవానుడికి గురువారం పౌర్ణమి హారతులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. గీతా పారాయణం, భజనలు చేశారు. రాత్రి పవలింపు సేవా కార్యక్రమం నిర్వహించారు.

లారీని ఢీకొని వ్యక్తికి గాయాలు

శ్రీరంగరాజపురం: లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఆరిమాకులపల్లి బీసీ కాలనీకి చెందిన గోవిందయ్య కుమారుడు శేఖర్ (37) కార్వేటినగరం నుంచి బైక్‌లో బయల్దేరాడు. పిల్లారికుప్పం క్రాస్ వద్ద లారీని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను 108లో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షెక్షావలి చెప్పారు.

భక్తి ప్రపత్తులతో గణనాథునికి వేదసద్వశం

కాణిపాకం(యాదమరి): స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోని అలంకార మండపంలో గురువారం వేదపండితులు భక్తి ప్రపత్తులతో స్వామివారికి వేదసద్వశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల అనంతరం స్వామివారికి వేదపండితులు రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదంతోపాటు శుక్లయజుర్వేదాలతో రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల నుంచి 30 మంది వేద పండితులు స్వామివారికి వేదసద్వశం చేశారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు వేద పండితులకు ప్రత్యేక స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. కాణిపాకం ఆలయానికి అన్ని ప్రధాన ఆలయాల నుంచి రావడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అర్చక వేదపండితులు, తదితరులు పాల్గొన్నారు.


కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం

ఉభయదారుల ఉత్సవాలు

చవితి బ్రహ్మోత్సవాలు అనంతరం, 11 రోజుల పాటు ప్రత్యేక ఉత్సవాలు 14 గ్రామాలకు చెందిన ఉభయదారులు నిర్వహిస్తారు. ఈ ప్రత్యేక ఉత్సవాలు ఉభయదారుల కోరిక మేరకు పురాతన కాలం నాటి నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు చెపుతున్నారు. వీటినే ప్రత్యేక ఉత్సవాలుగా చెపుతారు. వీటి పూర్తి బాధ్యతలు, ఖర్చులు ఆలయ అధికారులకు సంబంధం లేకుండా ఉభయదారులే భరిస్తారు. అందులో భాగంగా గురువారం అధికార నంది వాహనంపై, శుక్రవారం రావణబ్రహ్మ వాహనంపై, శనివారం యాళి, ఆదివారం విమానోత్సవం, సోమవారం సూర్యప్రభ, మంగళవారం చంద్రప్రభ , బుధవారం కామధేను, గురువారం కల్పవృక్షం, శుక్రవారం పూలంగిసేవ, శనివారం పుష్పపల్లకి సేవ, ఆదివారం తెప్పోత్సవంతో ప్రత్యేక ఉత్సవాలు ముగిస్తాయి. అక్టోబర్ 7న పుష్పపల్లకి సేవ, 8న తెప్పోత్సవానికి భక్తులు తరలివస్తారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రత్యేక ఉత్సవాలు 11 రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ప్రత్యేక ఉత్సవాల్లో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులకు నిత్య అన్నదానం అందించనున్నట్లు తెలిపారు. వేకువజామున స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక వాహన సేవలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చిన వారికి అన్ని సదుపాయాలు కల్పించడానికి తగు చర్యలు తీసుకుంటామని వివరించారు.

వినాయకునికి సాంస్కృతిక నీరాజనం

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలలో కళాకారులు స్వామివారికి సాంస్కృతిక ప్రదర్శనలతో నీరాజనం పట్టారు. స్వామివారి ప్రత్యేక ఉత్సవాలలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు, ప్రదర్శించిన భరతనాట్యం, పౌరాణిక నాటకం భక్తులకు అలరించాయి.


నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు


కళాకారుల నృత్య ప్రదర్శన


అలరించిన పౌరాణిక నాటకం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బిట్రగుంట(శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): బోగోలు మండలం కోవూరుపల్లి సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఐరాల మండలం కలికిరిపల్లికి చెందిన కాకర్ల దేవేంద్ర (22) మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కలికిరిపల్లికి చెందిన కాకర్ల దేవేంద్ర తన ద్విచక్ర వాహనంపై రాజమండ్రికి వెళ్లి తిరిగి వస్తుండగా కోవూరుపల్లి సమీపంలోకి వచ్చేసరికి ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పడంతో డివైడర్‌ను, రోడ్డు పక్కన ఉన్న సైన్‌బోర్డును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాకర్ల దేవేంద్ర తీవ్రంగా గాయపడగా, బైక్‌పై వెనుక కూర్చుని వస్తున్న రాజమండ్రికి చెందిన యువతి స్వల్పంగా గాయపడింది. క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే దేవేంద్ర మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. యువతి పరిస్థితి నిలకడగా ఉందని తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు బిట్రగుంట పోలీసులు తెలిపారు.

వాహనాల వేలం రూ.11.68 లక్షల ఆదాయం

పుంగనూరు: పట్టణంలోని పోలీస్‌స్టేషన్, ఎస్‌ఈబీ పోలీస్‌స్టేషన్‌లో వాహనాల వేలంలో రూ.4.59 లక్షలు ఆదాయం లభించింది. గురువారం ఎస్‌ఈబీ ఏఈఎస్ శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఎస్‌ఈబీ స్టేషన్‌లో 11 వాహనాలను వేలం వేయగా 8 వాహనాలు కొనుగోలు చేశారు. వీటి ద్వారా రూ.1.60 లక్షలు ఆదాయం లభించిందని సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. అలాగే పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో 12 వాహనాలను వేలం వేయగా రూ.2.99 లక్షలు ఆదాయం లభించినట్లు ఎస్‌ఐ మోహన్‌కుమార్ తెలిపారు. వేలం ద్వారా లభించిన సొమ్మును ప్రభుత్వానికి జమ చేసినట్లు చెప్పారు.

పలమనేరులో..

పలమనేరు: వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను గురువారం పట్టణంలోని సెబ్ కార్యాలయంలో సెబ్ సూపరిండెంటిండెంట్ బాబు శ్రీధర్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేశారు. మొత్తం 22 వాహనాలను వేలం వేశామని, తద్వారా రూ.7.09 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు సెబ్ సీఐ ఎల్లయ్య తెలిపారు. సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శ్రీకంచి కామాక్షి కల్యాణోత్సవం


ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు

చిత్తూరు రూరల్: నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం శ్రీకంచి కామాక్షి ఏకాంబరేశ్వరస్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. తొలుత షిరిడీ సాయినాథుని జన్మ నక్షత్ర పూజలను ఘనంగా చేపట్టారు. తర్వాత స్వామి ఉత్సవ విగ్రహాన్ని విశేషంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులు చేశారు. వేదపండితులు హోమ పూజలు జరిపించారు. శాస్త్రోక్తంగా కల్యాణోత్సవ ఘట్టాన్ని పూర్తి చేశారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు పసుపు కుంకుమ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీకేబాబు, గుణశేఖర్, మాలిని తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల విజృంభణ..బోనమందలో వైద్య శిబిరం

- తాగునీరు కలుషితమై జ్వరాలు
- ట్యాంకర్లతో తాగునీరు సరఫరా
- డీఎంహెచ్‌ఓ ప్రభావతి వెల్లడి


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి దేవి, డీపీఓ లక్ష్మి

సోమల: మండలంలోని పేటూరు పంచాయతీ బోనమందలో జ్వరాలు విజృంభించాయి. అధికారుల దృష్టికి ఇది వెళ్లడంతో వారి ఆదేశాల మేరకు వైద్యాధికారులు సోనియా, బాలాజి మూడు రోజుల నుంచి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రజలను పరీక్షించి మందులు అందజేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ నేపథ్యంలో గురువారం డీఎంహెచ్‌ఓ ప్రభావతి దేవి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి గ్రామాన్ని సందర్శించారు. జ్వరాల విజృంభణకు కారణాలేమిటో ఆరా తీశారు. 45 నుంచి 50 మంది వరకు జ్వరాలతో బాధ పడుతున్నట్లు తెలుసుకున్నారు. వారందరికీ చికిత్స చేయడంతోపాటు మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు చేశారని, అయితే ఎవరూ వాటి బారిన పడలేదని తేలిందని డీఎంహెచ్‌ఓ చెప్పారు. తాగునీరు కలుషితమై జ్వరాలు వస్తున్నట్లు తెలిసిందని, ఆ నీటి శాంపిల్స్ సేకరించి, ల్యాబ్‌కు పంపినట్టు చెప్పారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని, అంతవరకు గ్రామ సర్పంచ్‌తో మాట్లాడి ట్యాంకర్లతో తాగునీటిని అందిస్తామన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు సూచించారు. ఇక్కడున్న ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి వచ్చే నీటిని ఇతర అవసరాలకు వాడుకోవాలని, ఈ నీటిని తాగరాదని సూచించారు.అనంతరం గ్రామంలో పారిశుద్ధ్యం పనులను ముమ్మరంగా చేయాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు.కార్యక్రమంలో ఈఓపీఆర్డీ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు మసూదా బేగం, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గణేశ్ నిమజ్జనం

పాలసముద్రం: మండలకేంద్రం పాలసముద్రం బీసీ కాలనీలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహానికి పది రోజులుగా ప్రత్యేక పూజలు చేసి గురువారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేక దీపారాధనలు చేశారు. స్వామివారి వద్ద ఉంచిన లడ్డూని గ్రామస్తులు వేలం పాడారు. వేలంపాటలో సుబ్రమణ్యం కుమారుడు చంద్రశేఖర్ రూ.31 వేలు లడ్డూని తీసుకున్నారు. సాయంత్రం ఉభయదారులు కస్తూరమ్మ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ప్రసాదం పంచారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ గణేశ్ నిమజ్జనం చేశారు.

తూగుండ్రంలో..

గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం తూగుండ్రం కల్యాణ మండపం వద్ద గ్రామస్తులు వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. అర్చకుడు శివకుమార్ వేదమంత్రాలు పఠిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా భద్రకాళీ ఉత్సవాలు


ఆలయం వద్ద యాగ పూజల్లో పాల్గొన్న భక్తులు


పూజలందుకున్న భద్రకాళీ మాత

గుడిపాల: మండలంలోని నరహరిపేట చెక్‌పోస్ట్ సమీపంలో వెలసిన శ్రీ భద్రకాళీ అమ్మవారి ఉత్సవాలు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. సంతాన ప్రదాయినిగా, సకల రుగ్మతలను మాపే దేవతగా మూడు దశాబ్దాల క్రితం అటవీ ప్రాంతంలో శ్రీభద్రకాళి మాత వెలసింది. ఆనాటి నుంచి నేటి వరకు భక్తులను అనుగ్రహిస్తూ, అభయమిస్తోంది. మండల ప్రజలే గాక సమీపంలోని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు ఏటా ఈ ఉత్సవాలకు హాజరు కావడం విశేషం. ఆలయంలో గురువారం ఉదయం వేదపండితులు అత్యంత భక్తిశ్రద్ధలతో యాగం నిర్వహించారు. నరహరిపేట గ్రామానికి చెందిన సర్పంచ్ రజినీకాంత్, రాజేశ్వరి దంపతులు హోమం, యాగంతోపాటు అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. మాజీ ఎంపీపీ దీపశ్రీ, అనిల్ కుటుంబసభ్యులు మధ్యాహ్నం వెయ్యిమంది భక్తులకు అన్నదానం చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు అమ్మవారికి మొక్కులను చెల్లించుకున్నారు. రాత్రి ఆదిపరాశక్తి సుందరమాల వీధినాటకాన్ని ప్రదర్శించారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

ఐరాల: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఈ నెల 30 నుంచి అక్టోబర్ 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఐరాల, కాణిపాకం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలను ఎంపీడీఓ నాగరాజు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలో 30వ తేదీ పుత్రమద్ది, అక్టోబర్ 6వ తేదీ ఎం.పైపల్లె, 9న చినకాంపల్లె, 11న మద్దిపట్లపల్లె, 13న పుల్లూరు, 17న కామినాయనపల్లె, 19న చిగరపల్లె, 25న పి.ఎర్రేపల్లె సచివాలయాల్లో, ఐరాల పీహెచ్‌సీ పరిధిలో అక్టోబర్ 3న గుండ్లపల్లె, 5న ఇరువారంపల్లె, 7న పేరయ్యగారిపల్లె, 10న పొలకల-2, 12న నాగంవాండ్లపల్లె, 16న ఐరాల, 18న మొరంపల్లె, 20న పొలకల-1, 26న 35 యర్లంపల్లె, 28న వేద గిరివారిపల్లె సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఔట్‌సోర్సింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జ్ఞానశేఖర్

పూతలపట్టు: సాంఘిక సంక్షేమ శాఖ ఔట్‌సోర్సింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పి.కొత్తకోటకు చెందిన జ్ఞానశేఖర్ ఎన్నికయ్యారు. ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు వివిధ శాఖల నూతన కార్యవర్గం ఎంపికలో భాగంగా రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఔట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు జ్ఞానశేఖర్‌ను చైర్మన్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈయన పెనుమూరు మండలంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో విధులు నిర్వర్తిస్తున్నారు.


ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లతో జ్ఞానశేఖర్

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి

గుడిపాల: జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలని ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ రజినీకాంత్ అన్నారు. వసంతాపురంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ కార్యాలయంలో గురువారం వలంటీర్లు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించి ప్రతి ఇంటిలో నుంచి లబ్ధిదారులు వచ్చే విధంగా చూడాలన్నారు. దీనిద్వారా ఆరోగ్య సమాచారం వారికి తెలుస్తుందన్నారు. 105 వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మాత్రలను అందజేయనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఇటువంటి ఆరోగ్య సేవలు అందజేయడం ప్రభుత్వం గ్రామీణులకు ఇచ్చిన వరం అన్నారు.

భూముల ధరలకు బూమ్..బూమ్..!


రొంపిచెర్ల క్రాస్‌లో చేస్తున్న జాతీయ రహదారి పనులు

రొంపిచెర్ల: జాతీయ రహదారిలో మండలం సరిహద్దులోని మటోళ్లపల్లె నుంచి రాజువారిపల్లె వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూముల ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో రూ.10 లక్షల నుంచి 20 లక్షలు పలికిన ధరలు ఇప్పుడు కోట్లు పలుకుతున్నాయి. నేషనల్ హైవే పనులు వేగంగా చేస్తుండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను హైవేకు ఇరువైపులా ఉన్న భూములపై పడింది. పట్టా భూములు ఎకరా రూ. కోటి నుంచి కోటి 50 లక్షల వరకు, అలాగే డీకేటీ భూములు కూడా ఎకరా రూ50 లక్షల నుంచి 75 లక్షల వరకు కొనుగోలు చేయడానికి సిద్ధమని రైతులకు ఆఫర్ ఇస్తున్నట్టు తెలియవచ్చింది. రొంపిచెర్ల క్రాస్ రోడ్డులోని పులిచెర్ల రోడ్డు నుంచి గంగా దాబా వరకు ఫ్లైఓవర్ వస్తుందని ఉద్దేశంతో అక్కడ భూముల కొనుగోలుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. అయితే పులిచెర్ల రోడ్డు నుంచి పీలేరు వైపు రెండు కిలోమీటర్ల దూరంలో రెండు ప్రైవేటు కల్యాణ మండపాలు, రెండు హోటళ్లు, ఆదర్శ పాఠశాల ఉండడంతో పాటు నూతనంగా ఒక ప్రైవేటు కళాశాల నిర్మాణానికి పీలేరుకు చెందిన ఒక పాఠశాల యాజమాన్యం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా భూమిని కొనుగోలు చేసింది. దీంతో రియల్ వ్యాపారులు ఆ మార్గంలో భూముల కొనుగోలుకు ముందుకు వస్తున్నట్లు తెలిసింది. గతంలో ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు పనికి రావని అనుకున్న లబ్ధిదారులకు నేషనల్ హైవే వలన ఒక్కసారిగా భూముల ధరలు పెరగడంతో వీటికి కూడా మంచి డిమాండ్ వచ్చింది. దీంతో గతంలో ఇళ్ల పట్టాలు తీసుకుని వదిలేసిన వారందరూ ఇప్పుడు పరుగులు తీస్తున్నారు. భూములకు ఒక్కసారిగా ధరలు రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు


చిత్తూరు నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా గురువారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. భక్తి శ్రద్ధలతో సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిత్తూరు నగరంలోని శంకరాయగుంట నుంచి బజారువీధి వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జహురీ, సభ్యులు ఆను, రషీద్, మస్తాన్‌ఖాన్, అక్మల్‌ఖాన్, ఘని తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



విద్యార్థిని తల్లిదండ్రులతో మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జెల లక్ష్మి, ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి

పెనుమూరు (కార్వేటినగరం): అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి, మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జెల లక్ష్మి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్ చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున అన్నివిధాలా ఆదుకుంటామని వారు హామీ ఇచ్చారు. ఒకవేళ ఆ బాలికది హత్య అని తేలితే నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించేలా చూస్తామన్నారు. ఇదే విషయంపై పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జెల లక్ష్మి అన్నారు. విద్యార్థిని మృతిపై రాజకీయాలు తగదని చెప్పారు. అనంతరం జ్ఞానేంద్ర రెడ్డి, రాజేష్‌తో కలసి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలతరెడ్డి, గోవిందరెడ్డి, చక్రవర్తినాయుడు, ఐసీడీఎస్ సీడీపీఓ వినుతశ్రీ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శైలజ పాల్గొన్నారు.

టైర్ పంక్చరై అదుపు తప్పిన టూరిస్ట్ బస్సు

- టిప్పర్‌ను ఢీకొనడంతో ప్రయాణికులకు స్వల్పగాయాలు
- అదృష్టవశాత్తు తప్పిన పెనుప్రమాదం

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు చెరువుపై పలమనేరు- గుడియాత్తం మార్గంలో ఎదురెదురుగా రెండు వాహనాలు గురువారం ఢీకొన్నాయి. రెండు వాహనాలు ఢీకొన్నప్పటికీ అదృష్టవశాత్తు అవి చెరువు గట్టుపై నిలబడ్డాయి. ఒకవేళ చెరువులోకి పడి ఉంటే పెనుప్రమాదమే జరిగేదని ప్రయాణికులు చెప్పారు. ఈ ప్రమాదంలో టూరిస్ట్ బస్సులోని కొందరికి స్వల్పగాయాలు మినహా ఎవరికీ ఏం కాలేదు. పట్టణ సమీపంలో జరుగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే పనులకోసం మట్టి లోడుతో టిప్పర్ పెంగరగుంట నుంచి కట్టపై వస్తుండగా గుడియాత్తం వైపు యాత్రికులతో వెళుతున్న బస్సు టైరు పంక్చరై, అదుపు తప్పి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొంది. రెండు వాహనాల ముందరి భాగాలు నుజ్జు అయ్యాయి.


రోడ్డు ప్రమాదంలో నుజ్జు అయిన టూరిస్ట్ బస్సు ముందు భాగం